ప్రజాశక్తి
శుక్రవారం 20 జనవరి 2023
5
పార్వతీపురం మన్యం

కలెక్టర్‌ను కలిసిన డిటిఒ


కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిటిఒ

పార్వతీపురం: జిల్లా రవాణా అధికారిగా సి.మల్లిఖార్జున రెడ్డి బుధ వారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరు జిల్లా నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చారు. మల్లిఖార్జున రెడ్డి గతంలో నెల్లూరు, రాయలసీమ, పశ్చిమ గోదావరి తదితర జిల్లాల్లో వివిధ హెూదాల్లో పని చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రవాణా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రజల ఆహారంలో తృణధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రీ-సర్వే, భూసేకరణ, మ్యుటేషన్స్, జాతీయ రహదారుల ప్రోజెక్టులు మరియు వ్యవసాయ రంగానికి సంబంధించి రబీ కాలానికి ఇ-క్రాప్ బుకింగు, పి.ఎం .కిసాన్ ఇ-కెవైసీ నమోదు, బిందుసేద్యం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, జగనన్న పాలవెల్లువ, వై.ఎస్.ఆర్.చేయూత, గృహ నిర్మాణం, అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సంధర్భంగా వాటి వినియోగం ప్రోత్సాహం మొదలైన పథకాలు అమలు, జిల్లాల వారీగా లక్ష్యాలను సమీక్షించారు. అనంతరం సిఎస్ మాట్లాడుతూ భూ రికార్డుల్లో తప్పుగా నమోదైన వివరాలు వెంటనే సరిదిద్దాలని, భూ యజమానులకు అందిస్తున్న భూహక్కు పత్రాల్లో పేరు, సర్వేనెంబర్ల వివరాలు తప్పుల్లేకుండా చూడాలన్నారు. ఈనెల 25లోగా రబీ పంట ఇ-క్రాప్ బుకింగు పూర్తిచేయాలని, రైతులందరికీ ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం డబ్బులు అందించుటకు ఇ-కెవైసీ నమోదుచేయాలని తెలిపారు. పట్టు పరిశ్రమ, మత్స్యశాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను వేగవంతం చేయాలన్నారు. ఉగాది నాటికిగృహాల నిర్మాణాలు పూర్తిచేయాలని, కలెక్టర్లు వాటి పనుల ప్రగతిపైరోజువారీ సమీక్ష నిర్వహించాలన్నారు. గృహ నిర్మాణాలకు బ్యాంకులు, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

వై.ఎస్.ఆర్. చేయూత, వై.ఎస్.ఆర్. పాలవెల్లువ, బల్క్ మిల్క్ కూలింగు సెంటర్ల నిర్మాణం లక్ష్యాలు పూర్తిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ జిల్లా నివేదికలను తెలియజేస్తూ జిల్లాలో రీ-సర్వే రెండో విడత 78 గ్రామాల్లో గ్రౌండింగు పనులు పూర్తయ్యాయని, 78 గ్రామాల్లో వచ్చే 15 రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరు అధికారులతో సమీక్షిస్తూ ఖరీఫ్ పంటకు ఇ-పంట నమోదు, పిఎం కిసాన్ పథకానికి ఇ-కెవైసీ నమోదు వివరాలు అందజేయాలన్నారు. మత్స్యశాఖ ద్వారా ఏర్పాటవుతున్న స్టాల్స్ కు లబ్దిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుచేసి ప్రారంభించా లని తెలిపారు. గృహనిర్మాణాలకు సంబంధించి మండల వారీగా లక్ష్యాలు నిర్దేశించి పనులు వేగవంతంచేయాలని తెలిపారు. సమావేశంలో జెసి ఒ.ఆనంద్, పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

జాతర ఏర్పాట్లు ఎస్‌పి పరిశీలన

మక్కువ : ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లపై ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు సిబ్బందితో చర్చించారు. గురువారం శంబర గ్రామాన్ని సందర్శించి జాతరకు సంబంధించిన పలు భద్రతా అంశాలపై పోలీస్ శాఖ సిబ్బందితో ఆయన చర్చించారు. అనంతరం పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఇఒ రాధాకృష్ణ, పోలీస్ శాఖ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

పకడ్బందీగా కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్ష

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలోని పార్వతీపురంలో 17కేంద్రాల్లోనూ, సీతానగరం రెండు కేంద్రాల్లో పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్నట్లు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అన్నారు. గురువారం తన కార్యాలయంలో పోలీస్ అధికారులు, రీజనల్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న ఉదయం 10గంటల నుండి మద్యాహ్నం 1గంట వరకూ జరబోమే పోలీసు రిక్రూట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు పోలీస్‌కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలకు భద్రతాపరమైన అంశాలను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు నిబంధనల ప్రకారం పూర్తి చేస్తున్నామని, ఎలాంటి అనివార్య సంఘటనలకు తావు లేకుండా గట్టి భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పోలీసు అధికారులు, రీజనల్ కోఆర్డినేటర్లతో పకడ్బందీ చర్యలతో పాటు ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి ఓ.దిలీప్ కిరణ్, రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ సిఎచ్ చలపతి, డిఎస్‌పి ఎ.సుభాష్, ఎస్‌బి సిఐ ఎన్.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

అభ్యర్థులకు నిబంధనలు, సూచనలు

జిల్లాలో పరీక్ష రాసే అభ్యర్థులు 4,822 మంది ఉండగా, 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 17, సీతానగరంలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం ధ్రువీకరించిన ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్ కార్డ్, పాసుపోర్ట్, పాన్ కార్డ్ మొదలగు వాటిలో ఏదైనా ఒకటి తీసుకురావాలన్నారు. పరీక్ష 22న ఉదయం 10 గంటలకు ప్రారంభం కానందున అభ్యర్థులను 9 గంటల నుంచి పరీక్షా కేంద్రానికి అనుమతించబడును ఉదయం 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబడదు. పరీక్షా సమయంలో (10 గంటల నుండి 1 గంటల వరకు) అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లో బయటికి పంపరు. పరీక్షా కేంద్రానికి సెల్ ఫోన్లు అనుమతించబడవు. పరీక్షా కేంద్రానికి వచ్చే అభ్యర్థులు ఏ విధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని రాకూడదు. పరీక్షా కేంద్రాల్లో ఫ్లైయింగ్ స్కాడ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులు ఒకరోజు ముందే పరీక్షా కేంద్రం ఉన్న పట్టణానికి చేరుకోవటం మంచిది. పరీక్షా కేంద్రం వద్ద 30 పోలీసు యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉంటుంది ఎవరు గుమికూడరాదు. పరీక్షా కేంద్రానికి వచ్చే అభ్యర్థుల విలువైన వస్తువులకు వారే భాధ్యత వహించాల్సి ఉంటుంది. అభ్యర్థులు విలువైన వస్తువులు తీసుకు రాకపోవటం మంచిది.

డబ్ల్యూఇఎలు సక్రమంగా పనిచేయాలి

ప్రజాశక్తి-పాలకొండ

డబ్ల్యూఇఎలు సక్రమంగా పనిచేయాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం, సాధికారిత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలో సంక్షేమ, విద్యాసహాయకుల సమీక్షా సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్‌ల పనితీరు ఆధారంగానే 12 రకాల సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నందున అందుకు డబ్ల్యుఇఎలు అత్యంత నిక్కచ్చిగా పనిచేసి లబ్ధిదారుల సంక్షేమంలో పాలుపంచుకోవాలన్నారు. ఫీల్డులెవిల్‌లో ఏమైనా సమస్యలుంటే వెంటనే సంబంధిత సంక్షేమ కార్యాలయంలో సంప్రదించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధిఆరి ఎస్.కృష్ణ, జిల్లా ఎస్‌టి సంక్షేమ, సాధికారిత అధికారి బి.సూర్యనారాయణ, సీతంపేట ఎటిడబ్ల్యుఒ మంగవేణి, పాలకొండ ఎఎస్‌డబ్ల్యుఒ శశిభూషణరావు, డిపిఎంయు చక్రి, డివిజన్ పరిధిలోని మండలాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యానికి స్ఫూర్తి వేమన

ప్రజాశక్తి - కలెక్టరేట్

వేమన సామాజిక చైతన్యానికి స్ఫూర్తి అని, వారి పద్యాలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చాయని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో యోగి వేమన జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతిప్రజలన చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ వేమన పద్యాలు లోక నీతులను, సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణమని తెలిపారు. వేమన స్పృశించని అంశం లేదని, సమాజంలోని అన్ని సమస్యలను భిన్న కోణాల్లోంచి చూసి వాటి విశిష్ట్యాన్ని వేమన తన పద్యాల్లో ప్రదర్శించారని తెలిపారు. సామాజిక, కుటుంబ వ్యవస్థల్లోని లోటుపాట్లు, సామాజిక అస్థవ్యస్థత, సామాజిక జీవనంలోని ప్రతి అంశంపై వేమన పద్యాల్లో చెప్పారని తెలిపారు. వారు చెప్పిన పద్యాలలోని సారాన్ని గ్రహించి సామాజిక మార్పులు తీసుకురావాలన్నారు. ఆంగ్ల, ఐరోపా భాషలన్నింటిలోకి, అన్ని ద్రావిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువదింపబడ్డాయని, వేమనకు లభించిన ఈ గౌరవం మరే తెలుగు కవికి లభించలేదని అన్నారు. ఐక్య రాజ్య సమితి - యునెస్కో విభాగం వారు మేటి ప్రపంచ భాషా కవుల్లో ఒకరిగా వేమనను ఎన్నుకొని ఆయన రచనలను పలు భాషల్లోకి అనువదింపజేయటం వారి గొప్పదనానికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్‌క లెక్టర్ ఒ.ఆనంద్, ఆర్‌డిఒ కె.హేమలత, పరిపాలనాధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, కలెక్టరు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేమన చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

సాలూరు: పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో శుక్రవారం ప్రజాకవి వేమన జయంతి సందర్భంగా విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన జూనియర్, సీనియర్ స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలు ఎన్ని తరాలకైనా నిత్యసత్యాలుగా మిగిలిపోతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి వేమన శతకం పద్యాల్లోని సారాన్ని గ్రహించి జీవితంలో అలవర్చుకోవాలని కోరారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల సమావేశంలో తీసుకున్న తీర్మాణాలని అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మరణించిన కార్మిక కుటుంబాలకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, పిఎఫ్ నెలవారీ జాబితా నోటీస్ బోర్డులో ఉంచాలని, ఇఎస్‌ఐ ప్లానల్ క్లినిక్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కార్మికుల తదితర సమస్యలు పరిష్కారానికి మున్సిపాలిటీ అధికార యంత్రాంగం, పాలకవర్గం కృషి చేయాలని అన్నారు. సమావేశంలో పి.భాస్కరరావు, సిహెచ్.సంజీవ్, సురేష్, పి.వేణు, శ్రీదేవి, విమల, తదితరులు మాట్లాడుతూ సబ్బులు, నూనె, యూనిఫామ్ కుట్టుకూలు ఇవ్వాలని, కార్మిక సమస్యలు చర్చేందుకు జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

ఆర్‌బికె వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, సిపిఎం నాయకులు

బకాయిలు చెల్లించాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పాచిపెంట

ధాన్యం బకాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు, రైతులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు, గంటా కృష్ణ, మతల బలరాం రామకృష్ణ, బొంగు కృష్ణ మాట్లాడుతూ గతేడాది రూ.5లక్షల 60వేల బకాయిలు చెల్లించాలని, ఈ సొమ్ము విషయమై ఆర్‌బికె, జిల్లా వ్యవసాయ అధికారులను కోరినా నేటికీ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు రావాల్సిన డబ్బులు చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, పాత బకాయిల డబ్బులు నేటికీ చెల్లించకపోవడం సిగ్గుచేటని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని, లేకుంటే ఫిబ్రవరిలో వ్యవసాయ కార్యాలయాలు, ఆర్‌బికెల వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఫిబ్రవరి 2లోగా రైతులకు డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌర్నాయుడు మాట్లాడుతూ రైతుల సమస్యలను గాలికి వదిలేయడం సరైంది కాదని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు

తూనికలు, కొలతలపై గిరిజనులకు అవగాహన

కురుపాం : స్థానిక మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతలో గిరిజనులకు లీగల్ మెట్రోలజీ శాఖ ఇన్‌స్పెక్టర్లు కె.రత్నరాజు (పార్వతీపురం), ఎ.బలరామకృష్ణ (బొబ్బిలి), టి.శ్రీధర్ (పలాస) తూనికలు, కొలతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంతలో గిరిజనులు కొన్న సరుకులను వారు తూకం వేసి చూపించి వస్తువు నాణ్యత గురించి అవగాహన కల్పించారు. సంతలో ఉన్న వ్యాపారుల వద్ద గల ధర్మ కాటాలు, తూనిక రాళ్లు, వెయిటింగ్ మిషన్లను పరిశీలించి సీలు ఉందో లేదో చూసి సరుకుల నాణ్యత పరిశీలించి అనంతరం తూనికలు, కొలతల్లో ఎవరైనా మోసాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారస్తులకు సూచించారు.

రోడ్డు భద్రతతోనే ప్రమాదాలు నివారణ

బొబ్బిలి : రోడ్డు భద్రతోనే ప్రమాదాలను నివారించడం సాధ్యమని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని కోరారు.

చినమేరంగి జంక్షన్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణంలో ఇక్కట్లు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

సంక్రాంతికి వచ్చి సరదాగా గడిచి నాలుగు రోజుల పాటు కుటుంబాలతో స్నేహితులతో ఆనందంగా గడిపిన ప్రజానీకం తిరుగు ప్రయాణిలతో కూడల్లన్నీ రద్దీగా మారాయి. పెదమేరంగి జంక్షన్, చిన్న మేరంగి, సీమనాయుడు వలస జంక్షన్, సింగనాపురం జంక్షన్‌లో వద్ద ప్రయాణికులు వాహనాల కోసం వేచి ఉండడంతో కూడళ్లన్నీ రద్దీగా మారాయి. దీంతో ఆర్టీసీ బస్సులకు ఆదాయం లభించింది. ఆర్టీసీ విధించిన టార్గెట్ కంటే కండక్టర్లు ఎక్కువ మొత్తంలో ఆదాయం ఆర్టీసీకి సమకూరుస్తుంది. అలాగే ఆటో యజమానులు కూడా సంక్రాంతి గిరాకీతో ఆదాయాన్ని పొందుతున్నారు. కూడలన్నీ రద్దీతో కళకళలాడుతున్నాయి. దీంతో స్థానిక వ్యాపారులకు కూడా వ్యాపారం రద్దీగా కొనసాగుతోంది.

ప్రభుత్వ రంగాన్ని కాపాడండి

విజయనగరం :ప్రభుత్వ రంగాన్ని కాపాడండి.. ఎల్‌ఐసిని బలోపేతం చేయండి అంటూ జీవిత బీమా వ్యాపార జాతీయీకరణ దినోత్సవం సందర్భంగా ఎల్‌ఐసి ఉద్యోగులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక ఎల్‌ఐసి కార్యాలయం వద్ద ఉద్యోగులు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యునియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస మాట్లాడారు. ఎల్ ఐ సి దశాబ్దాలుగా, స్థిరంగా తన లక్ష్యాలను నెరవేరుస్తోందన్నారు. ప్రభుత్వ సామాజిక బాధ్యతలను నెరవేర్చడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని అన్నారు. 1956లో రూ.5 కోట్ల ప్రారంభ మూలధనంతో ప్రారంభమైన ఎల్‌ఐసి నేడు రూ.42, 30, 617 కోట్లు ఆస్తులు, రూ. 37, 35, 760 కోట్లు లైఫ్ ఫండ్ కలిగిఉందని వివరించారు. జీవిత బీమా వ్యాపారంలో రెండు దశాబ్దాల పోటీ తర్వాత కూడా దేశంలో జీవిత బీమా వ్యాపారంలో ఎల్ ఐ సి అత్యధిక మార్కెట్ వాటాను కలిగి ఉందన్నారు.ాకేవలం ఎల్‌ఐసి లోనే కాకుండా, బాగా లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ, ప్రైవేటీకరణ చాలా వేగంగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని తెలిపారు. ఈ విధానాలను బీమా ఉద్యోగులతో పాటు ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు.

ప్లాన్ పెట్టుకుని ఇళ్లు నిర్మించుకోండి : కమిషనర్

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

అప్రూవల్ అయిన లేవట్‌లో గృహ నిర్మాణాలు చేస్తున్న యజమానులు మున్సిపల్ కార్యాలయానికి ప్లాన్లు పెట్టుకుని గృహ నిర్మాణాలు చేయాలని, అనధికార లేఔట్‌లో గృహ నిర్మాణాలు చేసిన యజమానులు ఎల్‌ఆర్‌లు పెట్టుకుని గృహ నిర్మాణాలను చేసి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అన్నారు. గురువారం సౌందర్య థియేటర్ రోడ్డు వెనుక ఉన్న శత్రుచర్ల లేఔట్‌లో, ఆ లేఅవుట్ వెనుక భాగాన అనధికార లేఔట్లలో జరుగుతున్న గృహ నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారి పి.కనకారావు, ఆర్‌ఐ పి.నారాయణరావుతో కలిసి కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ప్లాన్ అప్రూవల్ లేకుండా గృహ నిర్మాణం చేస్తున్న యజమానులతో మాట్లాడుతూ ప్లాను పెట్టుకోవడానికి అవకాశం ఉన్నవారు 14% మున్సిపల్ కార్యాలయానికి చెల్లించి నిబంధనల మేరకు నిర్మాణాలు చేస్తే బ్యాంకు లోన్లు వస్తాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి పన్నులు కూడా రెవెన్యూ విభాగం వేయడం జరుగుతుందన్నారు. అనంతరం నివాస గృహాల యజమానులతో ప్రతి నెల యూజర్ ఛార్జీలు చెల్లించి మెరుగైన పారిశు ధ్య నిర్వహణ పొందాలని అన్నారు.

లేఅవుట్ల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ రామప్పలనాయుడు

ఏనుగుల దాడిలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని కుదమ పంచాయతీలో బుధవారం రాత్రి ఏనుగులుబీభత్సం సృష్టించాయి. 100 కెవి ట్రాన్స్ఫార్మర్‌తో పాటు నాలుగు విద్యుత్ స్తంభాలను ఏడు ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. దీంతో బుధవారం రాత్రి నుంచి కుదమ, చిన్న కొదమ, పరాజపాడు, పరజపాడు గదబవలస గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేకుండా పోయింది. గురువారం విద్యుత్‌శాఖ అధికారులుకు స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు ఎంఎస్‌ఎం డైరెక్టర్ ఎం.గౌరీశంకర్రావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఎఇ శ్రీనివాసరావుతో కలిసి ట్రాన్స్ఫార్మర్, విద్యుత్ స్తంభాలను హుటాహుటిన తీసుకొచ్చి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఎఇఒ శ్రీనివాసరావు గురువారం సాయంత్రానికి ఆయా గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఆధ్వర్యాన కల్పించారు.

ఏనుగుల సమస్య పరిష్కరించాలి : టిడిపి

నియోజకవర్గంలో ఏనుగులు ఎప్పటికప్పుడు నష్టం చేకూర్చుతున్నాయని, తక్షణమే వీటి నుంచి ప్రజలను కాపాడాలని టిడిపి అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని పెదకుదుమలో ఏనుగులు విద్యుత్ స్తంభాల ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి ధ్వంసం చేశాయి. దీంతో బుధవారం రాత్రి నుంచి సింగనాపురం, పెద్దకుదమ, చింతలబెలగాం, కుదమ, పరజపాడు, గదభవలస గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. వెంటనే ఆయన విద్యుత్ శాఖ ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా డొంకాడ రామకృష్ణ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగాఏనుగుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతున్నా కనీసం ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ముఖ్యంగా అరటి, చెరకు, పత్తి, మొక్కజొన్న, వరి రైతులు తీవ్ర నష్టపోతున్నారన్నారు. జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కురుపాం, కొమరాడ మండలాల పరిధిలో ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏనుగులను ఇతర ప్రాంతాలకుతరలించాలని ఆయన కోరారు.

ఏనుగుల దాడిలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

రికార్డుల పరిశీలిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి

గ్రంథాలయం సందర్శన

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకొని పుస్తకాలు చదివి విద్యార్థులు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని, పోటీ పరీక్షల కోసం చదువు కోవాలని కోరారు. గ్రంథాలయంలో అన్నీ రిజిస్టర్లు సక్రమంగా ఉన్నాయని, ప్రస్తుతం దారి సమస్యగా వుందని అన్నారు. ఎదురుగా కొత్తగా కట్టిన షాప్ వల్ల పాఠకులు రావడానికి ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు స్పందించి పాఠకులు గ్రంథాలయానికి రావడానికి దారి ఇవ్వడానికి సహకరించాలని కోరారు. గ్రంథాలయం చుట్టూ మట్టి, గేటు కోసం నాడు-నేడు పనుల్లో పెట్టామని, త్వరలో అన్ని పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఆయన వెంట గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ కలిగొట్టు గ్రామ సమీపంలో ప్రధాన రహదారి వద్ద ఎల్విన్‌పేట పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రా నుంచి ఒడిశా, శ్రీకాకుళం ప్రాంతాలకు వెళ్లే వాహనాలను సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు పరిశీలించారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాల్లో నిషేధిత సరుకులను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు జారీ చేశారు.

బుడ్డిపేటలో గడపగడపకు మనప్రభుత్వం

సీతానగరం : మండలంలోని పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేటలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారికి ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ, జెడ్పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి నాయకులు బి.శ్రీరాములు నాయుడు, బి.చిట్టిరాజు, పి.ఈశ్వర్ నారాయణ, లంక.లక్ష్మి, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

మక్కువ : మండల కేంద్రమైన మక్కువ ప్రధాన రహదారిలో సువర్ణముఖి నది వరకు అధ్వానంగా మారిన రహదారిని గురువారం ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న రహదారి అత్యంత ప్రమాదకరంగా మారడంతో ఈ ప్రాంతంలో జెసిబిలతో రహదారిని బాగు చేస్తున్నారు. ఈనెల 23 నుంచి శంబర పోలమాంబ జాతర జరగనున్న నేపథ్యంలో ఈ రహదారి మరమ్మతులకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రహదారి పనులు పూర్తయితే వాహనదారులకు కష్టాలు గట్టెక్కినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. రహదారిపైకి మురుగునీరు చేరడంతోనే తరచూ పాడవుతుందని, కావున సువర్ణముఖి నది వరకు మురుగునీరు పోయేందుకు తాత్కాలిక కాలువను కూడా తవ్వాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

పనిచేసి పూర్తి వేతనం పొందండి : ఎపిఒ

జియ్యమ్మవలస : ఉపాధి హామీ పథకంలో వేతనదారులు కొలతల ప్రకారం పనిచేసి పూర్తి వేతనాన్ని పొందాలని ఎపిఒ శ్రీనివాసరావు వేతనదారులకు సూచించారు. గురువారం పెదమేరంగి పంచాయతీ పెద్దవలసలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ మీటరు పొడవు, మీటరు వెడల్పు, అడుగు లోతు చొప్పున వేతనదారుడు ఒక రోజులో చేయగలిగితే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. సమయపాలన పాటిస్తూ రెండు పూటలా పనులను చేయాలని పేర్కొన్నారు. పనికి రాని వారి పేర్లను మస్టర్లలో నింపొద్దని, రాకపోతే ఆబ్సెంట్ మార్క్ చేయాలని మేట్‌కు సూచించారు. పని చేసి వేతనాన్ని పూర్తిగా వేతనదారులు పొందగలిగేలా ఉపాధి హామీ సిబ్బంది కూడా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ టి.ఈశ్వరరావు, కన్నపుదొరవలస ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శంకర్రావు ఉన్నారు.

26 నుంచి శ్రీ సూర్య వైభవాలు

పార్వతీపురం టౌన్ : పట్టణ శివారులో గల శ్రీ సూర్య పీఠంలో ఈ నెల 26న ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతకాలార్చన, విగ్నేశ్వర పూజతో ప్రారంభమై మాఘహేలా, శ్రీ సూర్య వైభవ వార్షికోత్సవ సంకల్పం, 27న సహస్ర కలశాభిషేకం, 28న శనివారం రథసప్తమి సందర్భంగా శ్రీ సూర్య భగవానుని కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకరణ ఊంజల్, పూలంగి సేవలు జరుగునని, పై కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ముందుగా సూర్య పీఠం ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో తమ గోత్ర నామాలతో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సూర్యాపీఠం నిర్వాహకులు ఆశేష శేముషి నిది వేమకోటి నరహర శాస్త్రి గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

సంతలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది

జీవిత బీమా పై అవగాహన

కురుపాం : స్థానిక మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతలో పోస్టల్ సిబ్బంది వి.తిరుపతిరావు, రఘునాథ పండ జీవిత బీమాపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొత్తగా పోస్టాఫీస్‌లో జీవిత బీమా పథకం పెట్టడం జరిగిందని, ఈ పథకంలో చేరాలనుకున్న వారు వారి ఆధార కార్డ్, మొబైల్ ఫోన్ నెంబరు, రూ.396 సమీపంలో గల పోస్ట్ ఆఫీస్‌లో చెల్లించాలన్నారు. ఇలా చెల్లించిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తూ రూ.10లక్షలు జీవిత బీమా పోస్టల్ డిపార్ట్మెంట్ కల్పిస్తుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరు కూడా జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది పవిత్ర, శ్రీను, మెల్వచర్ గౌరీ, గౌరిశంకర్, లక్ష్మణరావు, నరేష్, వెంకటరమణ, రాజేష్, రామారావు పాల్గొన్నారు.

శ్రీవిద్య పీఠం సందర్శన ఆనందదాయకం

పార్వతీపురంటౌన్ : పట్టణంలో గల శ్రీవిద్యసర్వమంగళాదేవి పీఠాన్ని దర్శించుకోవడం తనకు ఆనందంగా ఉందని తానా (తెలుగు అసోసియేషన్ నార్త్ అమెరికా) మాజీ ప్రెసిడెంట్ సతీష్ వేమన అన్నారు. గురువారం పట్టణానికి వచ్చిన ఈయన పట్టణానికి చెందిన ప్రముఖ నాడీ జ్యోతిష్యులు, శ్రీ విద్యా సర్వమంగళాదేవి పీఠం వ్యవస్థాపకులు మురపాక కాళిదాసు యాజి ఆధ్వర్యంలో శేష వస్త్రంతో స్థానిక దుర్గ చెట్టు వద్ద ఉన్న అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మురపాక కాళిదాసు యాజిని దుస్సాలువతో సన్మానించి ఆశీర్వచనం తీసుకున్నారు. దీనిలో భాగంగా 2014 నుంచి ఎందరో రాజకీయ ప్రముఖులు వచ్చి ఈ పీఠంలో ప్రత్యేక పూజలు, హెూమాలు, నిర్వహించారని వారికి ఎన్నో కార్యాలు సిద్ధించాయని, తద్వారా ఉన్నతమైన స్థానాల్లో ఈరోజు ఉన్నారని యాజీ అన్నారు. కార్యక్రమంలో వేద పండితులు పాల్గొన్నారు..

సర్వమంగళ పీఠాన్ని దర్శించుకున్న తానా మాజీ అధ్యక్షులు సతీష్ వేమన

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో గిరిజన గ్రామాల అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, అర్హులైన పేదగిరిజనులకు సంక్షేమ పథకాలు అందలేదని ఆరోపిస్తూ పాచిపెంట మండలంలోని గిరిశిఖర గ్రామాల యువకులు నియోజకవర్గ ఇన్ఛార్జి జి.సంధ్యారాణిని గురువారం కలిశారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. పాచిపెంట మండలం మూటకూరు, గరిసగుడ్డి, సతాబి, కేరంగి గిరి శిఖర గ్రామాల యువకులు డిప్యూటీ సిఎం రాజన్నదొరపై అసంతృప్తితో టిడిపి గూటికి చేరారు. గడచిన మూడున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం గిరిశిఖర గ్రామాల సమస్యలు పట్టించుకోలేదని ఆ గ్రామాల యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఎ ద్వారా తమకు ఏ విధమైన ఉపాధి పథకాలు లేవని చెప్పారు. పాచిపెంట మండలపార్టీ ప్రధాన కార్యదర్శి జి.యుగంధర్, క్లస్టర్ ఇంఛార్జ్ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యాన నాలుగు పంచాయతీలకు చెందిన యువకులు నియోజకవర్గ ఇన్నార్జి సంధ్యారాణిని కలిశారు. టిడిపి ఎస్టి సెల్ అధ్యక్షులు కోట లక్ష్మణరావు పర్యవేక్షణలో గిరిజన యువకులు టిడిపితో పయనించడానికి సంసిద్ధత వ్యక్తం.

కార్యక్రమాలకు దూరంగా పిన్నింటి

పాచిపెంట మండలంలో సంధ్యారాణి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలకు గత కొంతకాలంగా మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబు, ఆయన తండ్రి పిన్నింటి ఈశ్వరరావు దూరంగా వుంటున్నారు. వైసిపి ప్రభుత్వం గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే టిడిపి ఇదేం కర్మ మనరాష్ట్రానికి అని కార్యక్రమాన్ని చేపడుతోంది. నియోజకవర్గ ఇంఛార్జిగా జి.సంధ్యారాణి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో గల వార్డుల్లో ఇదేం కర్మ మనరాష్ట్రానికి అంటూ పర్యటిస్తున్నారు. ఏ మండలానికి ఆమె వెళ్తే ఆ మండల పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యాన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, తండ్రి పిన్నింటి ఈశ్వరరావు సంధ్యారాణి ఆధ్వర్యాన జరుగుతున్న కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ప్రధాన అనుచరుడైన పిన్నింటి ప్రసాద్ బాబు నియోజకవర్గ ఇన్నార్జి సంధ్యారాణి వ్యవహార శైలిపై అసంతృప్తితో వున్నట్లు తెలుస్తోంది. భంజ్ దేవ్ గ్రూపునకు చెందిన నాయకులకు సంధ్యారాణి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రసాద్ బాబు, ఈశ్వరరావు ఆమె చేపడుతున్న కార్యక్రమాలకు హాజరుకావడం లేదనే ప్రచారం జరుగుతోంది. గురువారం పాచిపెంట మండలానికి చెందిన గిరిజన యువకులు నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణిని కలిసిన కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ప్రసాద్ బాబుగాని, ఆయన తండ్రి ఈశ్వరరావు గాని లేరు. మండలంలో పార్టీకి గత అనేక ఏళ్లుగా పెద్ద దిక్కుగా ఉన్న పిన్నింటి కుటుంబాన్ని పక్కన పెట్టి ప్రత్యామ్నాయ నాయకత్వం రూపకల్పనలో ఇంఛార్జి సంధ్యారాణి వున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పిన్నింటి ప్రసాద్‌బాబు, ఈశ్వరరావు సంధ్యారాణి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. టిడిపి వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి తో తనకు విభేదాలు లేవని చెప్పారు. ఆయన అనుచరులు మాత్రం సంధ్యారాణి నాయకత్వం పై తీవ్ర అసంతప్తి తో రగిలిపోతున్నారు.

టిడిపిలో చేరిన గిరిజన యువత

ధర్మలక్ష్మీపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ధర్మలక్ష్మీపురంలో గురువారం104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కన్సెప్ట్ వైద్య అధికారి పి.అభినవ్ కుమార్ నిర్వహించారు. 32 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం నీలకంఠాపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు శారీరక ఆరోగ్యం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిజారాణి, ఎంఎల్‌హెచ్ కె పుష్పలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: వడచలివేంద్రిలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ పలువురికి తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎం ఎస్.పైడితల్లి, ఎంఎల్‌చ్‌పి హారిక, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు ,104 సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పోలినాయుడు

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

భామిని+ మండలంలోని మనుమకొండలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం సర్పంచ్ నిమ్మల కేశవ పరిశీలించారు. అంగన్వాడీ ద్వారా పిల్లలు, బాలింతలకు వైఎస్ఆర్ పోషణ, పోషణ ప్లస్ అందుతున్న సరుకుల రికార్డులను పరిశీలించారు. పిల్లలు, బాలింతల్లో పోషకహార లోపం రాకూడదనే పాలు, గుడ్లు అందజేస్తున్నారని, వీటిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. బాలింతలకు గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఆరిక వసంతరావు, అంగన్వాడీ నిర్వాహకురాలు నిమ్మల దమయంతి ఉన్నారు.

నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీ పురం

వాటర్ షెడ్ విధానాన్ని అనుసరించి నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐటిడిఎ వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు అధికారి ఆర్. పోలినాయుడు తెలిపారు. గురువారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, వాటర్ షెడ్ కమిటీ చైర్మన్, సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాటర్ షెడ్ నిర్వహణ అనేది ఒక వాటర్ షెడ్‌లోని నీరు ఇతర సహజ వనరుల నాణ్యతను రక్షించడానికి, మెరుగుకు, భూమి, నీటి వనరుల సమగ్ర పద్ధతిలో నిర్వహించడం ద్వారా భూ వినియోగ పద్ధతులు, నీటి నిర్వహణ పద్ధతులను అమలు చేసే ప్రక్రియ అని అన్నారు. నీటి సంరక్షణ ఉపరితల, భూగర్భ జలాలు రెండింటిలోనూ నీటి వనరుల సంరక్షణ నియంత్రణ, అభివృద్ధి కాలుష్య నివారణను సూచిస్తుందన్నారు. అలాగే నీటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో అవసరం గురించి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా మన దేశంలో జనాభా పెరుగుదల కారణంగా ప్రజలు నిత్యవసర వస్తువులను పొందడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ మేరకు ప్రతి ఒక్కరిపై నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని అన్నారు.కార్యక్రమంలో ఎల్విన్ పేట సర్పంచ్ ఆర్. చైతన్య ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి కొత్తకోట

భామిని : మండలంలోని 16 సచివాలయాలకు జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిగా బాలేరు ఎంపిటిసి కొత్త కోట చంద్రశేఖర్‌ను స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి నియమించినట్టు వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం తెలిపారు. జెసిఎస్‌గా మండలంలోని 16 సచివాలయాలకు ఏర్పాటు చేసిన కన్వీనర్లు, గృహసారధులను సమన్వయం చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 20లో ప్రతి సచివాలయ పరిధిలో గృహ సాంధులు ఏర్పాటు పూర్తి చేస్తామని, ప్రభుత్వం కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తామని అన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర ఇవ్వాలి

ప్రజాశక్తి - కొమరాడ

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కూనేరు రామభద్రపురం వద్ద గురువారం సిపిఎం, గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు పండించిన ఆదిత్య ధాన్యం కొనుగోలు చేయాలని నిరసన తెలిపారు. అనంతరం సాంబమూర్తి, నాయకులు ఈశ్వరరావు, రెడ్డి శివ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేద్దామని చెప్పినప్పటికీ కేవలం మిగతా ధాన్యాలనుకుంటున్నారు తప్ప ఆర్జీల సాంబ మసూరి ధాన్యం ఎక్కడా కొనే పరిస్థితి లేదని అన్నారు. ఈ విషయమై రామభద్రపురంలోని గల సచివాలయం సిబ్బందిని అడగ్గా తమకు ఇప్పటి వరకు ఎటువంటి అనుమతి లేదని, ఇకపై అనుమతులు వస్తే రేపటి నుండే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మిగతా ధాన్యం మాదిరిగే ఆర్జీల ధాన్యాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రేటు నుంచి ఆర్జీల ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసి గిరిజన రైతులకు అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. లేనిచో ఈ విషయంపై త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాములు ఈశ్వరరావు, గంగులు గంగరాజు పాల్గొన్నారు.

ఆర్‌బికె వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

క్షతగాత్రుల్ని దగ్గరుండి ఆస్పత్రికి తరలిస్తున్న సబ్‌కలెక్టర్

మానవత్వం చాటుకున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -భామిని

మండలంలోని సతివాడ సమీపంలో పోతల బాలకృష్ణ, లోపింటి అనిల్ ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. అదే సమయంలో నులకజోడు రీ సర్వే పరిశీలన నిమిత్తం వెళ్తున్న పాలకొండ సబ్ కలెక్టర్ నూర్‌కమర్ ప్రమాదాన్ని పరిశీలించి 108 కోసం ఎదురుచూడకుండా క్షటాగాత్రులను తన వాహనంలో కొత్తూరు ప్రభుత్వాఆసుపత్రికి తరలించి, వైద్యులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. దీంతో శభాష్ కలెక్టర్ అని ప్రజల ప్రశంసలు అందుకున్నారు.

వివరాలు కి వెళితే... గురువారం చిన దిమిలి, పెద దిమిలి భూ సర్వేను పరిశీలించారు. చిన్నదిమిలి లోని ప్రభుత్వ పాఠశాలను, అంగన్వాడీ, రైతు భరోసా కేంద్రం ను పరిశీలించారు. భూరీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎటువంటి తప్పులుకు ఆస్కారం ఇవ్వొద్దని సర్వే బృందానికి సూచించారు. ఈ సందర్బంగా ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు జరిగేలా చూడాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు కొవ్వాడ చిరంజీవులు తెలిపారు. ఈ క్రాప్ చేసిన రైతులు ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు. అనంతరం నూలుకజోడు భూ రీ సర్వేకు వెళ్తున్న సబ్ కలెక్టర్ సతివాడ వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గాయాలు పాలైన క్షత గాత్రులను తన సొంత వాహనం లో కొత్తూరు తరలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, సెక్రటరీ ఎం.మహేంద్రా, విఆర్ఒ వినోద్ కుమార్, సచివాలయ సిబ్బంది వున్నారు.

టిడిపి పలాస, విజయనగరం పరిశీలకుడిగా ద్వారపురెడ్డి

పార్వతీపురం రూరల్ : తెలుగుదేశం పార్టీ పలాస, విజయనగరం నియోజకవర్గాల పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావును రాష్ట్ర నాయకత్వం నియమించింది. గురువారం మంగళగిరిలోని జాతీయ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రెండు నియోజకవర్గాల పరిశీలకులుగా నియమితులైన జగదీశ్వరరావును రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు, పలువురు నాయకులు అభినందించారు.

జరడలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని జరడకాలనీలోని సమస్యలను పరిష్కరించాలని టిడిపి నాయకులు పడాల భూదేవి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆమె ఈ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ సమస్యలను భూదేవి ముందు ఏకరువు పెట్టారు. నాలుగేళ్ల గా సాగునీరందక వరి, శెనగ వంటి పంటలకు రైతులు దూరమయ్యామని, వర్షాధార పంటల పైనే ఆధారమని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లకృష్ణ సాగరం నుంచి వంతెనపై దోని సహాయంతో వచ్చే నీటితో వందలాది ఎకరాల భూమిని సాగుచేసేవారమన్నారు. వంతెన శిథిలావస్థకు చేరిన తర్వాత అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. జరడకాలనీ, చినబగ్గ, నాగులగూడ, గోరపాడు, బడిగాం తదితర గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే గ్రామ రహదారి దుస్థితిపై ఇప్పటికే పాలకులకు, అధికార యంత్రాంగానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. గ్రామంలో ఉన్న పాఠశాలను మూసివేయడం వల్ల చిన్నారుల చదువుకు ఆటంకం కలుగుతుందన్నారు. చిన్నారులు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్ళేందుకు ఆసక్తి చూపటం లేదని తెలిపారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో కక్ష సాధింపులకే అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గిరిజనుల కష్టసుఖాలు తెలుగుదేశం ప్రభుత్వం తెలుసుకొని పరిష్కరిస్తుందన్నారు. సబ్సిడీ అనేది గిరిజనులకు దక్కకుండా వైసిపి చేసిందని విమర్శించారు. ఐటిడిఎ కూడా ఉంటుందో ఊడుద్దో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. గిరిజనాభివృద్ధికి రోజు రోజుకు నిధులు తగ్గిస్తూ వస్తున్నారని ఆరోపించారు. గిరిజనులకు కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.

గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న భూదేవి

కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కిషోర బాలికల్లో రక్తహీనత నివారణ దిశగా తగు చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. గురువారం పట్టణంలో బెలగాంలో గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు రక్తహీనత, పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది నిర్వహించిన హిమోగ్లోబిన్ రక్త పరీక్షలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను మింగించారు. 10 నుంచి 19 ఏళ్ల వయసు గల కిశోర్ బాలికల ఆరోగ్య పర్యవేక్షణ దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా ప్రవేశ పెట్టిన యాప్‌లో ఈ పరీక్షల వివరాలను నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. రక్తహీనతగా గుర్తించిన కొందరు విద్యార్థులకు అందుకు గల కారణాలను వివరించి, జాగ్రత్తలు సూచించారు. సమతుల ఆహారాన్ని తీసుకోవాలని, బరువు తగ్గకుండా చూసుకోవాలని ఏవైనా అనారోగ్య లక్షణాలు వుంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పివి ప్రసాద్, పి.పార్వతి, సూపర్‌వైజర్లు పుష్ప, జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెసిబి బోల్తా

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పాండాయివలస రహదారిలో గురువారం ఉదయం జెసిబి వాహనం బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వడానికి రహదారి అంచుకు రావడంతో పొలంలోనికి బోల్తా పడింది. ఈ సందర్భంగా ఎవరికి ఏ విధమైన ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మొక్కజొన్నలో తెగుళ్ల నివారణ చర్యలు

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని చినభోగిలిలో వెంకటనాయుడు పొలంలో మొక్కజొన్నను మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా గా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నపై వస్తున్న తెగుళ్లపై జీరో టిల్లేజ్ మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ వరి మాగాణిలో జీరో టిల్లేజి పద్ధతిలో మొక్కజొన్నను వేస్తారని, ఈ విధానం లో వరి మాగనుల్లో దుక్కి దున్నకుండా నేరుగా మొక్కజొన్న విత్తనాన్ని ఉడవడం జరుగుతుందని అన్నారు. ఈ విధానంలో విత్తడం వల్ల తొలి దశ అనగా మొక్క రెండు లేదా మూడు ఆకుల దశలో ఉన్నప్పుడు కత్తెర పురుగు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ పురుగు సోకితే అకుని విచ్చల విడిగా తిని మొవ్వును కూడా కొరికి మొక్కను పూర్తిగా తినడం జరుగుతుందన్నారు.

కత్తెర పురుగును ఎలా గుర్తించాలి?

ఆకుపచ్చ నుంచి గులాబీ రంగు వరకు, గోధుమ లేదా నలుపు రంగు కళ్ల మధ్య తలక్రిందులుగా వై ఆకారంలో ప్రతి శరీర విభాగంలో ట్రాపెజాయిడ్ మాదిరి మచ్చలు కలిగి ఉంటుంది.

కత్తెర పురుగు నష్టం

ఏ పంట దశలోనైనా మొక్క యొక్క అన్ని భాగాలపై కత్తెర పురుగు దాడి చేస్తుంది. నష్టం చాలా వేగంగా చెందుతుంది – కోలుకోలేనిదిగా మారుతుంది. కత్తెర పురుగు వల్ల 60% వరకు దిగుబడి నష్టాలు ఉంటాయి. ప్రారంభ పంట దశలో ఇది మొక్క పెరుగుతున్న కొనను దెబ్బతీస్తుంది. గొంగళి పురుగులు ఆకులను తిని జీవిస్తాయి, ఇవి దిగుబడిని ప్రభావితం చేస్తాయి.

కత్తెర పురుగు నివారణ చర్యలు

కత్తెర పురుగు పంటకు ఆశించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. లేకుంటే ఈ పురుగు తక్కువ వ్యవధిలో పంట మొత్తాన్ని ఆకులు లేని అస్తిపంజరంలా తయారు చేస్తుంది.

జొన్నపంటలో తెగుళ్లను పరిశీలిస్తున్న ఎఒ

రైతులు అజాగ్రత్తగా ఉంటే ఈ కత్తెర పురుగు వల్ల పంటదిడుబడిలో 90శాతం వరకు నష్టపరిచే అవకాశాలున్నాయి. నివారణకు రసాయన మందులను పిచికారి చేసేప్పుడు ఉదయం సమయం, సాయంత్ర సమయాల్లో చేయడం మంచిది. లీటరు నీటిలో 5మిల్లీలీటర్ల వేప నూనె కలుపుకొని పిచికారి చేసుకోవాలి. లేదా ఒక లీటర్ నీటిలో 3మిల్లీలీటర్ల స్పెనోశాడ్ లేదా ఇమమెక్టిమ్ బెంజోయేట్ 4 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయాలి.

మహారాజశ్రీ పార్వతీపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS No.3/2022

Between:-
దొగ్గ అరుణ.... వగైరాలు .....వాదులు
And:-
దొగ్గ భువనేశ్వరరావు.... వగైరా.... ప్రతివాదులు

1. దొగ్గ భువనేశ్వరరావు, S/o లేటు అప్పలస్వామి, పెద్దవీధి, నర్సిపురం గ్రామం, పార్వతీపురం మండలం, Asst. మేనేజర్, Alkali Metals Ltd., Unit-II, Saragudem Village, Gundu Pochalampalli, Hyderabad, Telangana State.
2. దొగ్గ సింహాచలం, @ విశ్వనాధం, S/o లేటు అప్పలస్వామి, నర్సిపురం గ్రామం, పార్వతీపురం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాను మీపై వాదులు ఆస్థి పంపకపు దావాగా పై కోర్టులో వేసినందున అందులో మీ తాలుక హాజరు నిమిత్తం తే 27-1-2023ది నాటికి వాయిదా అయి ఉన్నది. కావున మీరు పై కోర్టులో **తే 27-1-2023దిన ఉదయం 10-30ని॥** మీరు ఖుద్దునగానీ, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు ఎమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో తెలియజేసుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా తీర్మానించబడునని యిందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

"By Order of the Court"
Ch. సత్యనారాయణ
బొబ్బిలి వాది తరుపు న్యాయవాది,
తేది: 19.1.2023 బొబ్బిలి